



లడ్డూ ఫైర్

డిక్లరేషన్‌పై జగన్ సంతకం పెట్టరు.. ఏం చేస్తారో చేసుకోండని భూమన కరుణాకరరెడ్డి హిందూ సమాజాన్ని మరింత రెచ్చగొడుతున్నారు. మా ఇష్టం అనడానికి ఇది మీ తాతలు నిర్మించిన గుడా, జాగీరా? ఎన్నాళ్లు ఇలా హిందూసమాజాన్ని మోసం చేస్తారు? - ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి, అలిపిరి పాదాల మండపం వద్ద

లడ్డూపై ఏర్పాటు చేసిన దర్యాప్తు బృందం.. చంద్రబాబు సిట్ అంటే కూర్చునేది, స్టాండ్ అంటే లేచేది. తిరుమలకు ఎంతోమంది అన్యమతస్థులు వస్తుంటారు. వారెవరినీ అడగని డిక్లరేషన్ జగన్‌నే ఎందుకు అడుగుతున్నారు. దీనిపై బీజేపీ నాయకులు రెండు నాల్కల ధోరణితో మాట్లాడుతున్నారు. - భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్, తాతయ్యగుంట గంగమ్మ గుడి వద్ద

నోట్ దిస్ పాయింట్ జగన్..!

వైసీపీ కన్నా కూటమి పార్టీల శ్రేణులకే ఎక్కువ నోటీసులు

తమవాళ్లకే నోటీసులిచ్చి అడ్డుకున్నారంటూ అబద్ధాలెందుకు?

తిరుపతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ వివాద నేపథ్యంలో తిరుమల పర్యటనకు సిద్ధపడి, రద్దు చేసుకున్న వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పోలీసులు నోటీసులివ్వడంపై రాద్ధాంతం చేశారు. రాష్ట్రంలో ఎప్పుడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోందని, దేవుడి దగ్గరకు వెళ్లాలనుకుంటే అడ్డుకునే మనస్తత్వం తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. తిరుపతి జిల్లాలోని తమ పార్టీ నేతలకు పోలీసులు నోటీసులిచ్చి అడ్డుకున్నారని, ఉల్లంఘించి బయటకివస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని జగన్ చెప్పడాన్ని కూటమి నేతలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వేలాదిమంది తమ నాయకులకు నోటీసులిచ్చారని శనివారం గంగమ్మ గుడిలో మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి అదే మాటను వల్లెవేశారు. తిరుపతి జిల్లాలో 218మంది వైసీపీ శ్రేణులకు పోలీస్ శాఖ నోటీసులివ్వగా 292 మంది కూటమి నేతలు కూడా నోటీసులందుకున్నారు. వీరిలో 154 మంది టీడీపీ నాయకులు, 138 మంది జనసేన నాయకులు ఉన్నారు. తిరుమలకు వచ్చిన తెలంగాణ బీజేపీ మహిళా నేత మాధవీలతకు కూడా పోలీసులు నోటీసులిచ్చారు. ఇవేమీ తెలియనట్టుగా తమ పార్టీ వాళ్లనే పోలీసులు నిర్బంధించారని చెప్పడం సిగ్గుచేటని కూటమి పార్టీల నేతలు మండిపడుతున్నారు.

● అప్పటి హౌస్ అరెస్టులు మరిచారా?

వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఏ మూల చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా తిరుపతిలోని కూటమి పార్టీల నాయకులంతా గృహ నిర్బంధాలకు గురయ్యేవారు. తిరుపతి టౌన్ బ్యాంకు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులను కూడా అరెస్టు చేయించిన ఘనత వైసీపీదే.తిరుపతికి జగన్ వచ్చే ప్రతి పర్యటనలోనూ కూటమి నేతల ఇంటి ముందు పోలీసులు నోటీసులతో ఉండేవాళ్లు. జగన్ తిరుగు ప్రయాణం అయ్యే వరకు అడుగు బయటపెట్టనిచ్చేవారు కాదు. టీడీపీ అధిష్ఠానం ఏదైనా నిరసనకు పిలుపునిచ్చినా వైసీపీ నేతల ఆదేశాలతో పోలీసులు కూటమి నేతల ఇంటి ముందు వాలిపోయేవారు. ఇవన్నీ మరిచిపోయి ఇప్పుడేదో రాక్షస రాజ్యం నడుస్తోందని వైసీపీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా వుందని కూటమి పార్టీల నేతలంటున్నారు.

● ఇప్పుడు కూటమి నేతలైనా...

శాప్ ఛైర్మన్‌గా ఎన్నికైన రవినాయుడు శుక్రవారం తిరుపతికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తెలుగు యువత నేతలు పెద్దయెత్తున స్వాగతం పలకాలని నిర్ణయించుకున్నారు. జగన్ పర్యటనను దృష్టిలో పెట్టుకుని పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఆయన తన పర్యటనను శనివారానికి వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. అదేవిధంగా టీటీడీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అనారోగ్యంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో మూడు రోజులుగా అడ్మిషన్‌లో ఉన్నారు. పోలీసులు అయన ఇంటికి వచ్చి ఆస్పత్రిలో ఉన్నట్టు ఫొటో, లొకేషన్ తెప్పించుకున్న తర్వాతే అక్కడి నుంచి కదిలారు. అదే వైసీపీ ప్రభుత్వంలో పోలీసులను ఇలా స్వేచ్ఛగా విధులు నిర్వహించుకోనిచ్చి ఉంటారా? అన్న ప్రశ్న కూటమి నేతల్లో ఉత్పన్నమవుతోంది.



రోజా దోచిందంతా కక్కిస్తా

శాప్ ఛైర్మన్ రవినాయుడు



తిరుపతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడా శాఖ మంత్రిగా రోజా దోచేసిన మొత్తాన్ని కక్కిస్తానని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు.రవి నాయుడికి పదవి వచ్చిన సందర్భంగా శనివారం సాయంత్రం తిరుపతిలో టీడీపీ, తెలుగు యువత శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి.ఎస్వీయూనివర్శిటీ నుంచి నగర వీధుల మీదుగా మంగళం రోడ్డులోని రవినాయుడు నివాసం వరకు ర్యాలీ సాగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్ల రూపాయల డబ్బును రోజాతో పాటు అప్పటి శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి దోచేశారని ఆరోపించారు. వైసీపీ హయాంలో క్రీడా శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలను బయటపెడతామన్నారు. రోజాతో పాటు బైరెడ్డిని జైలుకు పంపిస్తామన్నారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఊకా విజయకుమార్, శ్రీధర్ వర్మ, జేబీ శ్రీనివాస్, పులుగోరు మురళి, మహేష్ యాదవ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

2న పవన్ కల్యాణ్ రాక

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 28: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తిరుమల పర్యటన ఖరారైంది. అక్టోబర్ 2వ తేదీ సాయంత్రం 4 గంటలకు రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 5గంటలకు అలిపిరికి చేరుకుంటారు. కాలినడకన బయల్దేరి రాత్రి 9 గంటలకు తిరుమల చేరుకుంటారు. రాత్రికి అక్కడే బసచేసి 3వ తేదీ ఉదయం స్వామివారిని దర్శించుకుంటారు. సాయంత్రం తిరుమల నుంచి బయల్దేరి తిరుపతిలో జరిగే వారాహి సభకు హాజరవుతారు. సభ ముగిసిన తర్వాత రాత్రి 8 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. కాగా, వారాహి సభ నిర్వహణకు ప్రాథమికంగా లీలామహల్, అన్నమయ్య, జ్యోతిరావు పూలే కూడళ్లను ఎంపిక చేశారు.



జిల్లాలో 264 మద్యం షాపులు

తిరుపతిలో 200 మీటర్ల పాలసీ అమలయ్యేనా?

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న నూతన మద్యం పాలసీ మేరకు జిల్లాలో 264 మద్యం షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో తిరుపతిలో షాపులు ఎన్ని ఏర్పాటు చేయాలి? ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఎలా ఏర్పాటు చేయాలి అనే విషయాలపై ఎక్సైజ్ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి వరకు యాత్రికుల మనోభావాలు దెబ్బతినకుండా 200 మీటర్ల దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేసిన విషయం విదితమే. అదే తరహాలో ఇప్పుడు పాత విధానం అమలు చేస్తారా లేకుంటే దూరం ఇంకా పెంచుతారా అనేది తేలాల్సి ఉంది.

242మంది వీఆర్వోల బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 28: జిల్లాలో 242 మంది వీఆర్వోలకు స్థానచలనం కలిగింది. తిరుపతి జిల్లాలో కలిసిన చిత్తూరు జిల్లా పరిధిలోని 20 మండలాలకు సంబంధించి(జోన్ 4) 171 మంది, నెల్లూరు జిల్లా పరిధిలో నుంచి వచ్చిన 14 మండలాలకు సంబంధించి 71 మంది వీఆర్వోలను బదిలీ చేస్తూ శనివారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కొండేపాటి గంగా ప్రసాద్

గూడూరు, సెప్టెంబరు 28: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు జీవీఆర్ సంస్థ ప్రతినిధులు కొండేపాటి గంగాప్రసాద్, రాజు కోటి రూపాయల విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కును శనివారం మంగళగిరిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వారి వెంట ఉన్నారు.

శ్రీవారిమెట్టు వద్ద చిరుత కలకలం



చంద్రగిరి, సెప్టెంబరు 28: శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు వద్ద చిరుత పులి కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో చిరుత రావడంతో కుక్కలు అరుస్తూ వెంబడించాయి. చిరుతపులి వాటిపై దాడి చేయడానికి పరుగెత్తడంతో కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు దీపక్ అప్రమత్తమయ్యాడు. కంట్రోల్ రూమ్‌లోకి వెళ్లి తాళాలు వేసుకున్నాడు.శ్రీనివాసమంగాపురం నుంచి శనివారం ఉదయం 5 గంటలకు భక్తులను శ్రీవారిమెట్టుకు వదిలారు. అదే సమయంలో గార్డు దీపక్ గది నుంచి బయటకు వచ్చి టీటీడీ సెక్యూరిటీ, అటవీ శాఖ అధికారులకు చిరుత గురించి సమాచారమిచ్చాడు. తర్వాత కాలినడక భక్తులను గుంపులు, గుంపులుగా వదిలారు.

పంటపొలాలపై ఏనుగుల దాడి



పుల్లావాండ్లపల్లె పరిసరాలలో ధ్వంసమైన వరి పొలాలు

పాకాల, సెప్టెంబరు 28: మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లె పరిసరాల్లో పంటపొలాలను శుక్రవారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన శ్రీరాములు, రామచంద్ర, నరసింహులు, రామకృష్ణ మరికొందరి వరి పొలాలను తొక్కేశాయి. పరిసరాల్లో మామిడి, టెంకాయ చెట్లను విరిచేశాయి. కష్టపడి సాగుచేసిన పొలాలపై ఏనుగులు వరుస దాడులతో ధ్వంసం చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఏనుగుల బారి నుండి రక్షించాలని,పంట నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నారు.

ఘనంగా సుధారెడ్డి జన్మదిన వేడుకలు



తిరుచానూరులో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుచానూరు, సెప్టెంబరు 28: ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి, టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం తిరుచానూరులో పార్టీ నాయకులు వేడుకగా నిర్వహించారు. తిరుచానూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడుకిషోర్‌రెడ్డి నేతృత్వంలో భారీకేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, సురేంద్రనాయుడు, జీవన్, హరిరామ్‌రెడ్డి, వాసు, అరుణ్‌పాండ్యన్, సుధ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధన ప్రభుత్వ లక్ష్యం



గ్రామసభలో మాట్లాడుతున్న శివకుమార్

భాకరాపేట, సెప్టెంబరు 28: రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర- 2047 విజన్‌పై చిన్నగొట్టిగల్లులో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, నైపుణ్యం, ఆరోగ్య, సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాలు, ఆర్థిక అభివృద్ధి, నాలెడ్జి ఎకానమీ, గ్రీన్ ఇన్నోవేషన్, ప్రకృతి వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాలలో గణనీయమైన ప్రగతి సాధించాలనే లక్ష్యసాధనకు అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర, కార్యదర్శి మదనమోహన రాజు పాల్గొన్నారు.







తిరుమలలో జోరువాన

తిరుమలలో శనివారం ఉదయ నుంచి రాత్రి వరకు పలు దఫాలుగా వాన కురిసింది. దీంతో శ్రీవారి ఆలయంలో పాటు మాడవీధులు, రోడ్లు, కాటేజీలు, పార్కులు తడిసి ముద్దయ్యాయి. భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. వర్షం ఆగేవరకు భక్తులు సమీపంలోని షెడ్లు, చెట్లు, మండపాలు, కార్యాలయాల వద్ద నిరీక్షించారు. వర్షం ఆగిందనుకుని ముందుకు సాగేలోపే మళ్లీ కురవడంతో తడిచిముద్దయ్యారు. సాయంత్రానికి చలితీవ్రత పెరిగింది. - తిరుమల,(ఆంధ్రజ్యోతి)

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు

తిరుమల, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు టీటీడీ శనివారం ఉదయం వివరాలను ప్రకటించింది. శుక్రవారం 64,158 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,938 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో మోస్తరు రద్దీ

తిరుమల, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి):సాధారణంగా పెరటాశి మాసం(తిరుమల శనివారాలు)లో భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. మొదటి శనివారం నుంచి నాలుగోవ శనివారం వరకు భారీ సంఖ్యలో తిరుమలకు నడిచివచ్చి దర్శించుకుంటారు. తొలి శనివారం తరహాలో రెండవ శనివారం కూడా తిరుమలలో రద్దీ ఊహించినస్థాయిలో కనిపించలేదు. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 31 కంపార్టుమెంట్లలో భక్తులు నిండిపోయి నారాయణగిరి షెడ్లలోకి భక్తులు నింపుతున్నారు. వీరికి 15 గంటల దర్శన సమయం పడుతోంది. మామూలుగా కంపార్టుమెంట్లతో పాటు షెడ్లు నిండి క్యూలైన్ వెలుపలకు వస్తుంటుంది. మూడవ శనివారం అక్టోబరు5న వస్తోంది. ఆ సమయంలో బ్రహ్మోత్సవాలు కూడా ప్రారంభవుతాయి కాబట్టి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయని టీటీడీ అధికారులు భావిస్తున్నారు.

అవిగవిగో బ్రహ్మోత్సవ గొడుగులు

- చెన్నై నుంచి ఊరేగింపుగా 2న తిరుమల చేరిక

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా సమర్పించే గొడుగులు ఊరేగింపుగా చెన్నై నుంచి బయలుదేరాయి. ఊరేగించారు. నగరానికి చెందిన తిరుక్కుడై సేవా సమితి ట్రస్టు, విశ్వ హిందూపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఫ్లవర్ బజార్ ప్రాంతంలో ఈ ఊరేగింపును కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ ప్రారంభించారు. కేశవపెరుమాళ్ ఆలయం నుంచి చిన్మయా మిషన్ పూజ్య స్వామి మిత్రానంద మహరాజ్, విశ్వహిందూ పరిషత్ ఉత్తర తమిళనాడు అధ్యక్షుడు ఆండాల్ చొక్కలింగం, విశ్వహిందూ పరిషత్ అఖిల భారత న్యాయవాదుల సంఘం ప్రతినిధి ఎస్.శీనివాసన్, తిరుక్కుడై సేవా సమితి ట్రస్టు నిర్వాహక ట్రస్టీ జి.రామలింగం తదితరులు ఇందులో పాల్గొన్నారు. చెన్న కేశవపెరుమాళ్ ఆలయం నుంచి వేలాది మంది పరిషత్ సభ్యులు, స్థానిక భక్తులు మంగళవాయిద్యాల మధ్య ప్రారంభమైన ఊరేగింపు ఎన్‌ఎస్‌సీ బోస్ రోడ్డు, వాల్‌టాక్స్ రోడ్డు, చూళై హైరోడ్డు, అవధానపాపయ్య రోడ్డు, వడమలైపిళ్లై వీధి, చెల్లప్పావీధి, కున్నూరు హైరోడ్డు మీదుగా శనివారం రాత్రి అయనవరం కాశీవిశ్వనాథర్ ఆలయం శివశక్తి సత్సంగ్ మహల్‌కు చేరింది. ఆదివారం సాయంత్రానికి అంబత్తూరు పాత బస్టాండు ప్రాంతానికి చేరుతుంది. అక్టోబర్ రెండున తిరుమల చేరుతుంది.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, గొడుగుల ఊరేగింపు

బ్రహ్మోత్సవ భక్తులకు కట్టుదిట్టమైన భద్రత



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌తో కలిసి అదనపు ఈవో భద్రతాఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం, వాహనసేవలు జరిగేలా చూడాలని టీటీడీ, పోలీసు ఉన్నతాధికారులను అదనపు ఈవో కోరారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గరుడసేవ ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్నప్రసాదాలు చేరేలా చూడాలని సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షించేందుకు ముఖ్యమైన అధికారులతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు.

హిందీ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 28: హిందీ సాహిత్య సమ్మేళన్, అలహాబాద్ యూనివర్శిటీ నిర్వహించే హిందీ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తిరుపతి సెంటర్ సూపరింటెండెట్ డాక్టర్ షేక్ మస్తాన్ ఓ ప్రకటనలో సూచించారు. మధ్యమ విశారద్, ఉత్తమ సాహిత్యరత్న పరీక్షలకు రూ.200ల ఆలస్య రుసుముతో అక్టోబరు 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగినవారు తిరుపతి ఎం.ఆర్. పల్లి అన్న క్యాంటీన్ ఎదురుగా ఉన్న మన సంస్కృతి కేంద్రంలోగాని, 73960 49947 నెంబరులోగాని సంప్రదించాలని సూచించారు.

స్విమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ కోర్సులకు 3వ వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 28:శ్రీవెంకటేశ్వర విజ్ఞాన సంస్థ(స్విమ్స్) యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(నర్సింగ్), బీపీటీ, బీఎస్సీ(పారామెడికల్) కోర్సుల ప్రవేశానికి అక్టోబరు 2 నుంచి 3వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు స్విమ్స్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన లింకు ద్వారా కోర్సుల ఎంపికను చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. దరకాస్తు చేసుకున్న విద్యార్థుల ఫోన్ నెంబరుకు మెసేజ్ లేదా వారి ఈ-మెయిల్‌కు సమాచారం అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె కోరారు.

ఎయిర్‌పోర్ట్‌లో సుప్రీంకోర్టు సీజేకి ఘనస్వాగతం



రేణిగుంట, సెప్టెంబరు 28: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు శనివారం సాయంత్రం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, రిజిస్ట్రార్ జనరల్ జస్టిస్ రాఘవస్వామి,జస్టిస్ రామకృష్ణ, చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి వై.లక్ష్మణరావు, చిత్తూరు జిల్లా జడ్జి బీమారావు, ప్రోటోకాల్ ఆఫీసర్ గురునాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం భన్సల్ న్యాయమూర్తికి స్వాగతం పలికారు.

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

చంద్రగిరి, సెప్టెంబరు 28: ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి జన్మదిన వేడుకలను చంద్రగిరిలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద టీడీపీ నాయకుడు సక్కూరి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాగయ్యగారిపల్లె వద్ద అరుణోదయ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విడాకులివ్వకుంటే చంపేస్తానంటున్నాడు

- కానిస్టేబుల్ భార్య ఆవేదన



భర్త ఏలుమలైరెడ్డి ఫొటో చూపుతున్న ఉష

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 28: వేరే పెళ్లి చేసుకోవడానికి విడాకులు కోరుతున్నాడని, ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని కానిస్టేబుల్ భార్య ఉష ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏర్పేడు మండలం రాజులకండ్రిగకు చెందిన గాలి ఏలుమలైరెడ్డితో 2008 మే7న వివాహమైందని తెలిపింది. ఇద్దరు కుమారులు ఉన్నారని, అత్త పుష్పమ్మ ప్రోద్బలంతో మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని తెలిపింది. దీనిపై గతంలో పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపింది. అయినా ఆయన ప్రవర్తనలో ఏ మాత్రమూ మార్పు రాలేదని, వారం రోజుల క్రితం ఒక అమ్మాయి ఫొటో తీసుకొచ్చి 'నేను ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాను.. నువ్వు విడాకులు ఇవ్వు.. లేదంటే నిన్ను, నీకు అండగా ఉన్న నీ అన్నను చంపేస్తాను' అంటూ బెదిరించాడని చెప్పింది. ఆగస్టు 28వ తేదీన ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇంకా వేధింపులు ఎక్కువయ్యాయని చెప్పింది. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా లాభం లేకపోయిందని పేర్కొంది. దిశ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, చేతులు దులుపుకున్నారని తెలిపింది. ఉన్నతాధికారులు స్పందించి, న్యాయం చేయాలని కోరింది.

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష తదితరులు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 28: వైసీపీ పిలుపు మేరకు తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ పవిత్రతపై ఏ విచారణకైనా తాము సిద్ధమనే విషయాన్ని ఇప్పటికే చెప్పామని... అయితే చంద్రబాబు సిట్ ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వెంకటేశ్వరస్వామి చెల్లి అయిన గంగమ్మ తల్లిని ప్రార్థించామన్నారు. తిరుమలకు ఎంతోమంది అన్యమతస్థులు వస్తుంటారని, వారెవరిని డిక్లరేషన్ కోరలేదని, కేవలం జగన్‌పైన కుట్ర ప్రకారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ జగన్ పర్యటనను రాజకీయం చేశారని, చంద్రబాబు లడ్డూపై అపవిత్రమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీష, మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం

చంద్రగిరి, సెప్టెంబరు 28: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తొలుత ఉదయం ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పెరటాసి రెండవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపారాధన చేశారు. సాయంత్రం కన్నులపండువగా ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో భారీ వర్షం

రామచంద్రాపురం, సెప్టెంబరు 28: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా వాహనచోదకులు ఎక్కడికక్కడ గంటల తరబడి నిలబడి ఇబ్బంది పడ్డారు. చిన్నపాటి కాలువలు, వంకలు ప్రవహించాయి. ఎండిపోతున్న చెరుకు తోటలకు ఈవాన మేలు చేసింది. గంగిరెడ్డిపల్లి, కేకేవీపురం వద్ద ఇటుకలు తడిసిపోయాయి.

రసాభాసగా జంతువధశాల వేలం



అధికారులతో పాటదారుల వాగ్వాదం

చంద్రగిరి, సెప్టెంబరు 28: చంద్రగిరి పంచాయతీలో శనివారం నిర్వహించిన వేలంపాట రసాభాసగా మారింది. వారపు సంత, ప్రయివేటు బస్టాండ్, జంతువధశాలకు మాత్రమే వేలం పాట నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్ వేలం వాయిదా వేసారు. ఆరు నెలల కాలపరిమితికి వేలం నిర్వహించగా వారపు సంతను చంద్రగిరికి చెందిన షణ్ముగంరెడ్డి రూ.14.61 లక్షలు, ప్రయివేటు బస్టాండును వెంకటరెడ్డి రూ.4.20 లక్షలకు దక్కించుకున్నారు. జంతువధశాలను వేలంలో గౌస్‌బాషా, నాగరాజరెడ్డిలు పాల్గొన్నారు. నాగరాజురెడ్డి పాడే క్రమంలో గౌస్‌బాషాకు దక్కించుకున్నట్లు పంచాయతీ ఈవో మహేశ్వరయ్య ప్రకటించారు. దీంతో పాటదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలం ప్రక్రియ జరుగుతుంతే ముగిసినట్లు ప్రకటించడం తగదని అధికారులతో నాగరాజరెడ్డి, గురున్నాథంరెడ్డి వాగ్వాదానికి దిగారు. పాట ముగిసిందనే ఉద్దేశంతో గౌస్‌బాషాకు దక్కినట్లు ప్రకటించానని ఈవో అన్నారు. ప్రస్తుతం ఆగిపోయిన పాటకు పదిశాతం అదనంగా చెల్లిస్తే మరోసారి వేలం నిర్వహిస్తామన్నారు. చంద్రగిరికి చెందిన నాగరాజరెడ్డి ప్రస్తుతం పాడిన వేలం పాటకన్నా పదిశాతం నగదు అదనంగా చెల్లించి మరోసారి వేలం నిర్వహించాలని వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ రూపారామ్మూర్తి, ఈవోఆర్డీ శశిరేఖ, పంచాయతీ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

రైతు సహకార సంఘాన్ని డీసీసీబీలో చేర్చాలి



మాట్లాడుతున్న మల్లం చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 28: నరసింగాపురం రైతు సహకారసంఘాన్ని డీసీసీబీలో చేర్చాలని సంఘం సభ్యులు కోరారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాపతి ఆధ్వర్యంలో శనివారం సంఘ మహాజన సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం ఎండీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సింగిల్ విండో మాజీ ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి మాట్లాడుతూ సంఘాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి రైతులకు అందుబాటులో తెచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. అందుకు ప్రభుత్వం చేయూతను అందించాలన్నారు. తమ సంఘాన్ని సెంట్రల్ బ్యాంక్‌లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ రిటైర్డు మేనేజరు శేషారెడ్డి, సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, రైతు నాయకులు సుబ్రమణ్యంయాదవ్, గంగిరెడ్డి, పాల్గొన్నారు.

సుధారెడ్డికి పార్టీ శ్రేణుల శుభాకాంక్షలు

భాకరాపేట, సెప్టెంబరు 28: ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు, భాకరాపేటల్లో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, జిల్లా కార్యదర్శి సుజాత, సర్పంచ్ మనోహర, సుబ్రహ్మణ్యం, లోకనాథం, బెల్లంకొండ రమణ, వెంకటరత్నం, చోటా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



రేబిస్ వ్యాధి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 28: రేబీస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు అన్నారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ రుయాస్పత్రి నుంచి వివేకానంద సర్కిల్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ, డీఎస్‌వో హరిత, డీఎంవో రూప్‌కుమార్, వైద్యాధికారులు లావణ్య, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న రవి నాయుడు, ఎమ్మెల్యే ఆరణి, నరసింహ యాదవ్

స్పోర్ట్స్ హబ్‌గా తిరుపతి

- కష్టపడిన యువతను టీడీపీ గుండెల్లో పెట్టుకుంటుంది
- శాప్ ఛైర్మన్ రవి నాయుడు


తిరుపతి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడారంగానికి కృషి చేస్తానని, తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని రాష్ట్ర స్పోర్ట్ అథారిటీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. శాప్ ఛైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఆయన శనివారం తిరుపతికి వచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుపతి నేతకు రాష్ట్రస్థాయిలో తొలి కీలక పదవి రావడంతో తెలుగు యువత, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈసందర్భంగా రవి నాయుడు మీడియాతో మాట్లాడుతూ... గత ఐదేళ్లుగా కనుమరుగైన క్రీడలకు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు క్రీడాశాఖపై సమీక్ష నిర్వహించారన్నారు. రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు పోతోందని చెప్పారు. త్వరలోనే క్రీడలకు కొత్త పాలసీ కూడా తయారు కానుందన్నారు. తిరుపతి, అమరావతి, వైజాగ్‌లను స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేస్తామని, దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రకటన చేశారని తెలిపారు. టీడీపీలో కష్టపడిన కార్యకర్తను పార్టీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారు నిరాశ చెందవద్దని, అందరికీ న్యాయం జరిగేలా అధిష్ఠానం తగు చర్యలు తీసుకుంటుందన్నారు.

వర్సిటీ నేలను ముద్దాడి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి..

రాజకీయ రంగంవైపు బాటలు వేసిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రధాన గేటు ముందు రవి నాయుడు సాష్టాంగ నమస్కారం చేసి నేలను ముద్దాడారు. అనంతరం అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి తెలుగు యువత, పార్టీ శ్రేణులు ఏర్పాటుచేసిన ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత తిరుచానూరు సర్కిల్ వద్ద గజమాలలతో ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఎస్వీయూకు చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఊకా విజయకుమార్, శ్రీధర్ వర్మ, జేబీ శ్రీనివాస్, పులుగోరు మురళీ, మహేష్ యాదవ్, వివేక్ తదితరులు అక్కడ నుంచి ఓపెన్ టాప్ వాహనం ఎక్కి ర్యాలీగా బయలు దేరారు. అక్కడ నుంచి పూలే విగ్రహం, ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి లీలామహల్ సర్కిల్ మీదుగా మంగళం రోడ్డులోని రవి నాయుడు నివాసం వరకు ర్యాలీ సాగింది. యువత కేరింతలు, దారిపొడవునా క్రేన్లతో గజమాలలు, బాణసంచా పేలుళ్లతో కేడర్‌లో సరికొత్త విజయోత్సవ జోష్ కనిపించింది. రవి నాయుడికి శుభాకాంక్షలు తెలిపినవారిలో ఎస్వీ ప్రసాద్, చిన్నంగారి రమణ, పాటకం వెంకటేష్, కొట్టే హేమంత్ రాయల్, ఆముదాల తులసీరాం, సుబ్బు యాదవ్, జగదీష్, నీలం హరి, ఉదయ్, వినయ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


రవినాయుడిని సత్కరిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేత కొట్టే హేమంత్ తదితరులు

రంగవీక్షణం పుస్తకావిష్కరణ



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 28: తిరుపతికి చెందిన ఆకాశవాణి విశ్రాంత ఉద్యోగి, రచయిత ఆకుల మల్లేశ్వరరావు మంచి సమీక్షకులని, వేదవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి అన్నారు. శనివారం సాయంత్రం లక్ష్మీపురం సర్కిల్ లోని ఒక హోటల్లో రంగవీక్షణం పుస్తకావిష్కరణ సభ జరిగింది. విశ్వశ్రీ సాహితీ సమాఖ్య నిర్వహించిన ఈ సభలో ముఖ్యఅతిథిగా పుస్తకావిష్కరణ చేసిన అనంతరం సదాశివమూర్తి మాట్లాడుతూ... ప్రసంగం ఎలా చేయాలనే విషయాన్ని మల్లేశ్వరరావునుంచి తెలుసుకున్నానని చెప్పారు. పాతికేళ్ల క్రితం తిరుపతి రేడియో శ్రోతలకు ఆయన తనను పరిచయం చేశారని తెలిపారు. కథలు, నవలలు, పాటలు, నాటకాలు ఇలా అన్ని రంగాలలో ఆయన మంచి సమీక్షలు చేశారన్నారు. పుస్తక సమీక్షను ఒక వ్యాపకంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో నాటక కళారంగానికి చెందిన నగర ప్రముఖులు బి.యస్. రెడ్డి, వి.యస్. రాఘవాచారి విశిష్ట అతిథులుగా హాజరై రచయితను అభినందించారు. ప్రవచన కర్త గరికపాటి రమేష్ బాబు పుస్తక సమీక్ష చేశారు. శతావధాని ఆముదాల మురళి అతిథులను సభకు పరిచయం చేయగా, నెమిలేటి కిట్టన్న వందన సమర్పణ చేశారు. రచయిత ఆకుల మల్లేశ్వర రావు తన స్పందన తెలియజేశారు. వేమూరి జయరాం ప్రసాద్, ఏనుగు అంకమ నాయుడు నిర్వహణలో జరిగిన సభలో ఇంకా గంగవరపు శ్రీదేవి, టెంకాయల దామోదరం, తోట వేంకటేశ్వర్లు, మర్థం గసేంద్రం, జిల్లేల బాలాజీ, కొత్వాలు అమరేంద్ర, ఆర్‌సీకే రాజు, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 28: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో పురటాసి మాసం రెండవ శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బండ్లవీధి భజన గుడి నుంచి గోవిందరాజ స్వామి ఆలయ నాలుగు మాడవీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు. చివరగా ప్రసాద వితరణ చేశారు. గోపినాథరెడ్డి, భక్తులు, గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.



స్టేట్ ట్యాక్స్ ఏసీకి సత్కారం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 28: స్టేట్ ట్యాక్స్ తిరుపతి-1 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు నాయుడిని శనివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు మాట్లాడుతూ శ్రీనివాసులు నాయుడి పనితీరు అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆదాయం పెంపుకోసం అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని స్పష్టం చేశారు.

యువతకు భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం


కార్యక్రమంలో పాల్గొన్న కిరణ్‌రాయల్, కార్పొరేటర్ అన్నా అనిత, ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 28: ఈ తరం యువతకు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని జనసేన నేత కిరణ్ రాయల్ పేర్కొన్నారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో భగత్‌సింగ్ జయంతి సభ శనివారం నిర్వహించారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ నిర్వహించిన పోరాట స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం యువత కృషి చేయాలని కోరారు. టీడీపీ కార్పొరేటర్ అన్నా అనిత మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం ఈ తరం బాధ్యత అని గుర్తు చేశారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ జీవితం నుంచి ఈ తరం యువత సామాజిక బాధ్యతను అలవరుచుకోవాలని సూచించారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ ఛైర్మెన్ కృష్ణ యాదవ్, అధ్యక్షులు హేమాద్రియాదవ్, జిల్లా అధ్యక్షులు శ్రీధర్, వర్సిటీ అధ్యక్షులు ఉపేంద్ర, నాయకులు గంగరాజు, ఉత్తన్న, వేణురెడ్డి, ముక్తార్‌భాష, వెంకట్‌గౌడ్, నవీన్‌కుమార్, రవి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిర్‌లో...



తిరుపతి(విద్య): భగత్‌సింగ్ జయంతి వేడుకలను స్థానిక రైల్వే కాలనీలోని సరస్వతి శిశు మందిర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, సరస్వతి శిశు మందిర్ పాఠశాల కరస్పాండెంట్ హేమంత్ కుమార్, తిరుమల శెట్టి రవిశంకర్, సురేంద్రరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం


భగత్‌సింగ్ విగ్రహంవద్ద నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని విద్యార్థి, యువజ సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు నినదించారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం వారు నగరంలోని ఆయన విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ త్యాగాల గురించి వివరించారు. సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, ప్రవీణ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జి.నాగరాజు పాల్గొన్నారు.

2న మిలిటరీ సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్షపై విశ్వంలో అవగాహనా సదస్సు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 28: రాష్ట్రీయ మిలిటరీ, సైనిక్ పాఠశాలల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షపై ఉచిత అవగాహనా సదస్సును నిర్వహించనున్నట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. అక్టోబరు 2వ తేదీన స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం పాఠశాలలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమౌతుందని తెలిపారు. 5 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని జాతీయ పరీక్ష వివరాలను తెలుసుకోవచ్చని, అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకుగాను ఈఏడాది డిసెంబరు 12వ తేదీన మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్ష జరుగనుందని, వివరాలకు 86888 88802, 93999 76999 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడ్డ జాషువా


మాట్లాడుతున్న సీనియర్ పాత్రికేయులు రాఘవ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 28: తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి సాహిత్య సృజన చేసిన మహాకవి గుర్రం జాషువా అని పలువురు కవులు కీర్తించారు. దివంగత జాషువా జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో కవిసమ్మేళనం జరిగింది. వేమన విజ్ఞాన కేంద్రం, సాహితి స్రవంతి సంయుక్తంగా నిర్వహించిన ఈ సభకు సీనియర్ పాత్రికేయులు రాఘవ సంధానకర్తగా వ్యవహరించారు. ఈ కవిసమ్మేళనంలో జాషువా కవిత్వం, జీవితం, మానవీయ విలువల గురించి కవులు నెమిలేటి కిట్టన్న, ప్రవీణ్, ఆమూరి సుబ్రమణ్యం, నాగలక్ష్మి, ఓవి రమణ, గోపాల్, శ్రీనివాసులు, ఆదిశేషు తదితరులు గానం చేశారు. సాహితీవేత్తలు సాకం నాగరాజ, టెంకాయల దామోదరం, మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ మెరుగుపడాలి


ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌తో సమావేశమైన ఉన్నత విద్యా మండలి ప్రతినిధులు


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 28: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఆర్ఎఫ్) ర్యాంకులను మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతినిధులు కోరారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ను మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏర్పాటు చేసిన ముగ్గురు ప్రతినిధుల బృందం ఎస్వీయూలో శనివారం పర్యటించింది. మాజీ వీసీ ఫజుల్ రెహమాన్, బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ భాస్కర్ భట్టాచార్య, భారతీయార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సంగీత ఈ బృందంలో ఉన్నారు. యూనివర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించిన ఈ బృందం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పాటిస్తున్న ప్రమాణాలను పరిశీలించింది. అంతకుముందు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుతో సమావేశమైంది. యూనివర్సిటీలోని సదుపాయాలు, పరిశోధనా ప్రగతి వంటి వివరాలను అధికారులు వివరించారు.

'హే సిరీ అలా వెళ్లకే' ట్రైలర్ విడుదల

తిరుపతి (లీలామహల్), సెప్టెంబరు 28: హే సిరీ అలా వెళ్లకే.. వెబ్ సిరీస్ కుటుంబ సమేతంగా చూసేటట్లు ఉంటుందని డైరెక్టర్ క్రిష్టఫర్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే వెబ్ సిరీస్‌ను విడుదల చేస్తామన్నారు. హీరో సాయి, హీరోయిన్ శీలాలోక సుధన్, శాస్త్రి, మౌనిక, భరత్, విల్సన్, రవి పాల్గొన్నారు.


సమావేశంలో హేసిరీ అలా వెళ్లకే సినిమా యూనిట్ సభ్యులు





పుత్తూరు వార్తలు

మార్చిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోండి



సమావేశంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 28: ప్రభుత్వ గృహ నిర్మాణ పథక లబ్ధిదారుగా ఒక మారు నమోదైన తరువాత భవిష్యత్తులో మరో అవకాశం ఉండదని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. పీఎంఏవై పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణ జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలతో పాటు అదనంగా రూ.35 వేల రుణ సదుపాయం కల్పిస్తామని భరోసా కల్పించారు. ఇప్పటి వరకు పునాదుల వరకు జరిగిన నిర్మాణాలకు రూ.70 వేలు అందించామని, మిగిలిన రూ.1.30 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. 2025 మార్చి నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే రాయితీ నగదును కోల్పోతారని తహసీల్దార్ వెంకటేశ్వర్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ, గృహ నిర్మాణ సంస్థ ఏఈ వెంకటరత్నం, మున్సిపల్ డీఈ చంద్రశేఖర్ రెడ్డి, టీపీవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరేటమ్మ ఆలయంలో వైసీపీ నాయకుల పూజలు

పుత్తూరు, సెప్టెంబరు 28: పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పట్టణంలోని ఆరేటమ్మ ఆలయంలో వైసీపీ నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ హరి, వనిత, బేగం, శంకర్, మనోహర్‌రెడ్డి, లారీమోహన్, మోహన్‌రెడ్డి, చిన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

పుత్తూరు, సెప్టెంబరు 28: విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగదారుల సౌకర్యార్థ ఈనెల 29న ఆదివారం కార్యాలయాలు పని చేస్తాయని డీఈఈ ఆశ్వీరాదం తెలిపారు. డివిజన్‌లోని అన్ని కార్యాలయాలు పని చేస్తున్నందున వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోవింద భక్తులకు అన్నదానం

వడమాలపేట, సెప్టెంబర్ 28: తిరుమలకు పాదయాత్రగా వెళ్లే గోవింద భక్తులకు అంజేరమ్మ కనుమ వద్ద శనివారం అన్నదానం చేశారు. పుత్తూరుకు చెందిన ఆర్టీసీ జయచంద్ర, మునస్వామి, కోర్టు వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

రాష్ట్రస్థాయి పోటీలకు వడమాలపేట విద్యార్థులు



వడమాలపేట, సెప్టెంబర్ 28: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు చెప్పారు. తిరుపతిలో శనివారం జరిగిన అండర్ 19 జూడో పోటీల్లో టెన్త్ విద్యార్థినులు జాహ్నవి (36 కిలోలు), భవిత (40 కిలోలు), చిన్మయి (44 కిలోలు) విభాగాల్లో రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 రెజ్లింగ్ పోటీల్లో టెన్త్ విద్యార్థి వరుణ 80 కిలోల విభాగంలో ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణా, నవనీతం, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

సనాతన ధర్మం బాధ్యత హిందువుల కర్తవ్యం


ఆలయం ఎదుట జనసేన నాయకుల నిరసన

వడమాలపేట, సెప్టెంబర్ 28: సనాతన హిందూ సంప్రదాయానికి రక్షణగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని నగరి నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు ఎం. మహేష్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీకి నిరసనగా ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మునిశేఖర్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ గజేంద్ర, గుణశేఖర్, చక్రవర్తి, బాలాజీ, మహేష్, నిఖిల్, గోపీ, జస్వంత్, మునిరత్నం, సురేష్, అర్షిత్ తదతరులు పాల్గొన్నారు.

అప్పలాయగుంటలో పవిత్రోత్సవాలు ప్రారంభం

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం


ఉభయ దేవేరులతో శ్రీవారు

వడమాలపేట, సెప్టెంబర్ 28: మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. శనివారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పవిత్రాలను ప్రతిష్ఠించారు. పద్మావతి, ఆండాల్ సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం ఉభయదేవేరులతో స్వామివారి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు నారికేల కర్పూర నీరాజనాలు సమర్పించారు. రాత్రి యాగశాలలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

సామాజిక అసమానతలపై అస్త్రాలు గుర్రం జాషువా రచనలు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 28: గుర్రం జాషువా రచనలు సామాజిక అసమానలపై ఎక్కు పెట్టిన అస్త్రాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీరయ్య తెలిపారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా జయంతి నిఘనంగా నిర్వహించారు. దళిత కుటుంబంలో జన్మించిన జాషువా అనేక రచనల ద్వారా సమాజాన్ని జాగృతి చేశారని వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశన్, నరసింహులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 28: భగత్‌సింగ్ జయంతి వేడుకలను పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్రాంతి, రమేష్, దామోదరం, రాజేష్, శివ, నవీన్, కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేద్దాం

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 28: రైతులు తమ కృషితో తడుకు సహకార సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సహకార సంఘం అధికారి ఝాన్సీ అన్నారు. శనివారం తడుకు వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... దాదాపు 20 గ్రామాలకు చెందిన 4 వేలమంది ఉన్న సంఘం ప్రస్తుతం 80 మందికి పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సహకరిస్తే వ్యాపార లావాదేవీలు నిర్వహించి సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవచ్చన్నారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు, వేరుశనగ, వరి విత్తనాలను రాయితీకి పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం 2023-24 ఆడిట్‌ను ఆమోదించారు. శ్రీనివాసులు రెడ్డి, ఎస్ బాలసుబ్రమణ్యంరాజు, పుత్తూరు డివిజన్ సహకార సిబ్బంది నిరంజన్‌బాబు, వెంకటరమణ, సీఈవోలు బద్రీనాథ్, వేణు, వినోద్, డైరెక్టర్లు అంబు, కేశవ మందడి రైతులుపాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

వడమాలపేట, సెప్టెంబర్ 28: ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జరీనా హెచ్చరించారు.అంజేరమ్మ కనుమ వద్ద ఎర్రమట్టిని తరలిస్తున్నారని సమాచారం అందగానే పనులను నిలిపివేయించామని చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 28: మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ కిషోర్ బాబు తెలిపారు. శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24న చెన్నూరు గ్రామానికి చెందిన రమేష్ తనకు అత్త వరసైన ఆనందమ్మను తలపై కర్రతో కొట్టి హత్య చేశాడన్నారు. శనివారం తిప్పవరప్పాడు జంక్షన్ వద్ద ఉన్న రమేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

4న దుకాణాల వేలం పాట

గూడూరు అర్బన్, సెప్టెంబరు 28: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్, మాంసం, చేపల దుకాణాలు, రోడ్డు వెంబడి దుకాణదారుల నుంచి దినసరి మార్కెట్ రుసుం వసూలు చేసేందుకు అక్టోబరు 4వ తేదీన స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పోలేరమ్మ చీరల వేలం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 28: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారికి చీరలను సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం వద్ద వేలం వేయనున్నట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

తమ్ముడి కోసం అన్న, వదిన కిడ్నాప్

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 28: తమ్ము ఆచూకీ చెప్పాలంటూ అన్న, వదినను కిడ్నాప్ చేసిన ఘటన పట్టణంలోని ఏకలవ్య నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధితుల బంధువుల కథనం మేరకు... బాలాయపల్లి మండలంలోని కడగుంట గ్రామానికి చెందిన వొప్పతొట్టి అంకయ్య, కృష్ణవేణి వెంకటగిరిలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంకయ్య తమ్ముడు పెంచలయ్య కడగుంట గ్రామానికి చెందిన త్రివేణిని ప్రేమించి వివాహం చేసుకున్నారు. అయితే త్రివేణి కుటుంబ సభ్యులు తమ కుమార్తె కనిపించడం లేదని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రేమజంటను పిలిపించి రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా అమ్మాయి వినలేదు. అంతేకాకుండా ఇళ్లు వదిలి వెళ్లిపోయారు. వారికి ఆచూకీ చెప్పాలంటూ అంకయ్య అన్న, వదినపై త్రివేణి బంధువులు దాడి చేసి కిడ్నాప్ చేశారు. వీరి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

గూడూరు, సెప్టెంబరు 28: టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 3వ తేదీ నుంచి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేద్దామన్నారు. ప్రస్తుతం సభ్యత్వం కలిగిన కార్యకర్తలు రెన్యూవల్ చేసుకోవడంతో పాటు, కొత్తవారు సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం ఇవ్వడం జరుగుతుందన్నారు.

రవినాయుడికి పలువురి అభినందనలు


రవినాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

సత్యవేడు/ నాగలాపురం, సెప్టెంబరు 28: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్‌గా(శాప్) నియమితులైన రవి నాయుడిని సత్యవేడు నియోజక వర్గానికి చెందిన పలువురు తెలుగు యువత నాయకులు శనివారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీపతి రాజు, తులసీరామ్, కందస్వామి తదితరులు పాల్గొన్నా రు. అలాగే నాగలాపురం టౌన్ తెలుగుయువత నాయకులు నరేంద్ర రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, మండల నాయకులు శ్రీనివాస యాదవ్, పార్తిబన్, జాన్సన్, జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ లీలా ప్రసాద్‌లు కలిసి పూలమాలలతో సన్మానించి పల్లికొండేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

నాగలాపురం, సెప్టెంబరు 28: మైనర్లు రోడ్లపై వాహనాలు నడిపితే వారిపై, వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని నాగలాపురం ఎస్ఐ సునీల్ కుమార్ హెచ్చరించారు. శనివారం నాగలాపురం బజారు వీధుల్లో ద్విచక్ర వాహనాలను నడిపిన పలువురు మైనర్లను స్టేషన్‌కి తరలించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు నిరంజన్

ఏర్పేడు, సెప్టెంబరు 28: తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-19 జూడో జిల్లా జట్టు ఎంపికలు జరిగాయి. మండలం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థి నిరంజన్ 40 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల హెచ్ఎం ఆనంద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పవాణి తదితరులు అభినందించారు.

పంచాయతీ కార్మికుల దీక్ష విరమణ

పిచ్చాటూరు, సెప్టెంబరు 28: మండలం కేంద్రంలో 12 రోజులుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దీక్ష చేస్తున్న ఏపీ స్వచ్ఛభారత్ పంచాయతీ కార్మికులు దీక్ష విరమించారు. పెండింగ్ జీతాల కోసం దీక్ష చేసిన వారికి అధికారుల ఆదేశాల మేరకు ఒకటిన్నర నెల జీతం అందిస్తామని ఎంపీడీవో చెప్పడంతో దీక్ష విరమించారు.

కుక్క కాటుకు నాటుమందులు వాడొద్దు

సత్యవేడు, సెప్టెంబరు 28: కుక్క కాటుకు నాటుమందులు వాడొద్దని, ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి ఇంజెక్షన్లు వేసుకోవాలని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి గుణశేఖర్ చెప్పారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో కుక్క కాటువల్ల తలెత్తే అనర్థాలు, చికిత్సలపై అవగాహన కల్పించారు. కుక్క కరిచిన రోజున, అలాగే 3, 7, 28 రోజుల్లో నాలుగు ఇంజెక్షన్లు వేసుకుంటే సరిపోతుందన్నారు. ఎంపీహెచ్ఈవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాళంగి గ్రాయిన్‌కు వీడనున్న గ్రహణం

రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఇరిగేషన్‌శాఖ ● గత ఐదేళ్లలో టెండర్ల దాఖలుకు ముందుకురాని కాంట్రాక్టర్లు

తడ, సెప్టెంబరు 28: కాళంగి గ్రాయిన్‌కు గ్రహణం వీడనుంది. శాశ్వత పరిష్కారం కోసం టీడీపీ ప్రభుత్వం నడుం బిగించింది. తద్వారా కాళంగినది పరివాహక ప్రాంతం సశ్యశామలం కానుంది. కేవీబీపురంలో ప్రారంభమయ్యే కాళంగినది దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల మీదుగా తడ మండలంలో ప్రవేశించి చేనిగుంటవద్ద పులికాట్ సరస్సులో కలుస్తుంది. నదిలో నీళ్లు లేనిసమయంలో పులికాట్‌లోని ఉప్పునీరు నదిలోకి ప్రవేశించి కాళంగినది పరివాహక ప్రాంతంలోని భూగర్భజలాలను ఉప్పు నీళ్లమయంగా మార్చేస్తోంది. దీనిని గుర్తించిన షార్ అధికారులు రెండు దశాబ్దాల క్రితం చేనిగుంటవద్ద కాళంగినది పులికాట్ కలిసే ప్రదేశంలో అడ్డుగా గ్రాయిన్ నిర్మించారు. కొంత కాలానికి అది దెబ్బతినడం, అప్పటి నుంచి పలు సందర్భాల్లో తాత్కాలికంగా గ్రాయిన్‌కు మరమ్మతులు చేయడం, చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. చివరిసారిగా 2015లో సుమారు రూ.35లక్షల వ్యయంతో గ్రాయిన్‌కు మరమ్మతులు చేశారు. 6 నెలలకే అది దెబ్బతినడంతో 2018లో రూ.3.35 కోట్ల వ్యయంతో గ్రాయిన్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.

ఐదేళ్లుగా ముందుకురాని కాంట్రాక్టర్లు

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అప్పటి జలవనరులశాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ గ్రాయిన్‌ను పరిశీలించి ఆరు నెలల్లో శాశ్వత నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అధికారులు రూ.8.40 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు సార్లు టెండర్లకు ఆహ్వానించారు. అయితే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురాలేదు. మరోసారి రూ.9.98 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి రెండుసార్లు టెండర్లకు ఆహ్వానించినా అదే పరిస్థితి. దీంతో గ్రాయిన్ నిర్మాణం కలగానే మిగిలిపోయింది.


దెబ్బతిన్న కాళంగి గ్రాయిన్

శాశ్వత పరిష్కారానికి టీడీపీ కృషి

టీడీపీ అధికారంలోకి రావడంతో గ్రాయిన్ ప్రాముఖ్యతను అధికారులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. పొర్లుకట్టలు ఆధునీకరణతో పాటు శాశ్వత గ్రాయిన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ మేరకు సుమారు రూ.6.50 కోట్ల వ్యయంతో పొర్లుకట్టల ఆధునీకరణ, మరో రూ.13.5 కోట్లతో శాశ్వత గ్రాయిన్ నిర్మాణానికి నివేదికలు సిద్ధమయ్యాయి. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నామని ఇరిగేషన్‌శాఖ డీఈ శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతోనే టెండర్లకు ఆహ్వానిస్తామని ఆయన చెప్పారు.

పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే చంద్రబాబు ధ్యేయం: విజయశ్రీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 28: రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట - బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో ఉన్న టిడ్కో గృహాల వద్ద శనివారం నిర్వహించిన 'మన ఇళ్లు... మన గౌరవం' కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సూచించారు. పూర్తిచేసిన ఇళ్లకు తక్షణమే బిల్లులు అందించే విధంగా చర్యలు ముఖ్యమంత్రి తీసుకొంటున్నట్లు తెలిపారు. త్వరలోనే టిడ్కో గృహాలను కూడా లబ్ధిదారులకు అప్పగించడం జరుగుతుందన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల సౌకర్యం కోసం షేర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించారని, చివరిదశలో ఎన్నికలు రావడం, ఆ తరువాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఆ ఇళ్లను పూర్తిచేయకుండా నిర్వీర్యంచేసి పేదల కడుపుకొట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టిడ్కో గృహాల పనులు ప్రారంభమయ్యాయని, త్వరితగతిన పేదలకు అప్పగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తిరుమలకు వెళ్లకుండా ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అడ్డుకుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు అన్యమనస్కంగానే తిరుమలకు వచ్చేవారని అన్నారు. అలాంటి వ్యక్తికి వెంకటేశ్వరస్వామి మీద ఎంత భక్తి ఉందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రఫీ, పసల గంగాప్రసాద్, విజయకుమార్ నాయుడు, నాగేంద్రరెడ్డి, నారాయణ, సుబ్బారావు, రవి, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

ఏ-5 హోటల్‌కు ఉత్తమ అవార్డు


పురస్కారంతో బద్రిగిరి, హోటల్ సిబ్బంది

చిల్లకూరు, సెప్టెంబరు 28: మండలంలోని బూదనం సమీపంలోని ఏ-5 హోటల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా అవార్డును అందించినట్లు యజమాని బద్రిగిరి తెలిపారు. శనివారం హోటల్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యాట దినోత్సవం సదర్భంగా శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పర్యాటక రంగంలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న రెస్టారెంట్లకు అందజేసిన పురస్కారాల్లో బెస్ట్ వే సైడ్ ఎమినిటీస్ విభాగంలో తమ హోటల్‌కు విశిష్ట పురస్కారాన్ని మంత్రి కందుల దుర్గేష్ అందజేశారన్నారు. వరుసగా మూడోసారి పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విహారి, జయంత్, విజయ్‌కన్నన్, రంజిత్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఆర్యవైశ్యసంఘ నాయకులు

నాయుడుపేట, సెప్టెంబరు 28: ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం పట్టణంలోని ఆర్యవైశ్య కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగింది. మాజీ మంత్రి, ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు టీజీ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్ జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం టీజీ వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు సత్యనారాయణ, లక్ష్మయ్య, నరసింహులశెట్టి, రజనీ, జక్కాసుబ్బరాజు, స్థానిక నాయ కులు పెసల జయరాజ్ గోపాల్, కిషోర్‌బాబు, కోటా వెంకటేశ్వర్లు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కనమర్లపూడి సుబ్రమణి, సురేంద్ర, శ్రీరాములు, కిష్టయ్య, సత్యం, బాబు, చిన్ననారాయణ, చెంచుకిషోర్ పాల్గొన్నారు.

జగన్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి: టీడీపీ

డక్కిలి, సెప్టెంబరు 28: మాజీ సీఎం జగన్‌పై దేశద్రోహం కేసు పెట్టాలని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ నికోబార్ దీవుల ఇన్‌చార్జి వెంపటి మాధవ నాయుడు అన్నారు. శనివారం ఆయన డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు డిక్లరేషన్ గురించి మాట్లాడుతూ జగన్ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని, హిందూమతాన్ని కించపరచడమేనని అన్నారు.

చెంగాళమ్మ సేవలో ఆర్డీవో కిరణ్మయి


చెంగాళమ్మ ఆలయంలో ఆర్డీవో

సూళ్లూరుపేట, సెప్టెంబరు 28: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని నూతనంగా బాధ్యతలు తీసుకొన్న ఆర్డీవో కిరణ్మయి శనివారం చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు ఆమెకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు కిరణ్మయి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ నరసింహారావు ఉన్నారు.

విడాకులివ్వకుంటే చంపేస్తానంటున్నాడు

- కానిస్టేబుల్ భార్య ఆవేదన


భర్త ఫొటో చూపుతున్న బాధితురాలు

తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 28: వేరే పెళ్లి చేసుకోవడానికి విడాకులు కోరుతున్నాడని, ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని కానిస్టేబుల్ భార్య ఉష ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏర్పేడు మండలం రాజులకండ్రిగకు చెందిన గాలి ఏలుమలైరెడ్డితో 2008 మే7న వివాహమైందని తెలిపింది. ఇద్దరు కుమారులు ఉన్నారని, అత్త పుష్పమ్మ ప్రోద్బలంతో మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని తెలిపింది. దీనిపై గతంలో పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపింది. అయినా ఆయన ప్రవర్తనలో ఏ మాత్రమూ మార్పు రాలేదని, వారం రోజుల క్రితం ఒక అమ్మాయి ఫొటో తీసుకొచ్చి 'నేను ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాను.. నువ్వు విడాకులు ఇవ్వు.. లేదంటే నిన్ను, నీకు అండగా ఉన్న నీ అన్నను చంపేస్తాను' అంటూ బెదిరించాడని చెప్పింది. ఆగస్టు 28వ తేదీన ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇంకా వేధింపులు ఎక్కువ య్యాయని చెప్పింది. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా లాభం లేకపోయిందని పేర్కొంది. చివరకు దిశ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, చేతులు దులుపుకున్నారని తెలిపింది. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరింది.

గురివింద సామెతలా కామిరెడ్డి వ్యాఖ్యలు: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, సెప్టెంబరు 28: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులపై ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి చేస్తున్న ఆరోపణలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఎద్దేవా చేశారు. మట్టి, గ్రావెల్, ఇసుకను అక్రమంగా తరలిస్తూ టీడీపీ నేతలు ప్రజాధనాన్ని దోపిడి చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోపై స్పందించారు. తాళ్వాయిపాడులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేంలో కృష్ణయ్య మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పేదలకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూముల నుంచి వాగులు, వంకలు, కొండలు, అటవీ భూములు, చెరువులు అన్నింటిని చెరబట్టిన చరిత్ర వైసీపీ నేతలదన్నారు. చివరకు శిరసనంబేడు సిద్ధేశ్వర స్వామి కొండతో పాటు, రోసనూరు భూపతేశ్వరస్వామి తిప్పలను నామరూపాలు లేకుండా చేశారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగి స్తున్న సీఎం చంద్రబాబుపై అవాకులు, చవాకులు పేలితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

తడ, సెప్టెంబరు 28: ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల్లో గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని మత్స్యశాఖ డీడీ నాగరాజు తెలిపారు. శనివారం తడకండ్రిగ సచివాలయం వద్ద జరిగిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మార్చిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని, అందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఇంటి నిర్మాణాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నగదును కాంట్రాక్టర్ సొంతం చేసుకున్నారని చెప్పారు. హౌసింగ్‌శాఖ ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ విషయంపై సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడామని, రెండు, మూడు రోజుల్లో తాను వివరణ ఇస్తానని చెప్పారని తెలిపారు. ఆయన వివరణ సంతృప్తికరంగా లేకపోతే పోలీసు కేసు నమోదు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో తహసీల్దారు శరత్‌బాబు, సర్పంచు జయప్రద, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమం కోసం కృషి

వెంకటగిరి, సెప్టెంబరు 28: పద్మశాలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాస్ గంగాధర్ అన్నారు. పద్మశాలి డైరెక్టరుగా నియమితులైన గంగాధర్‌ను శనివారం పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు టీడీపీ నేతల ఆర్థిక సాయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 28: సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని హేమ ఎస్ఎల్ఈ వ్యాధితో బాధపడుతుండడంతో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో నాయకులు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అదే గ్రామంలోని బూత్ కన్వీనర్ సీహెచ్ సురేష్ సతీమణి ఆరోగ్య పరిస్థితి బాగలేకపోవడంతో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు.

పెంచిపోషించిన వారినే రోడ్డున పడేసింది

వృద్ధ దంపతులను రోడ్డుపాలు చేసిన దత్త పుత్రిక

కానిస్టేబుల్ సహకారంతో బంధువుల చెంతకు


వృద్ధ దంపతులను ఆటోలో ఎక్కిస్తున్న కానిస్టేబుల్ పెంచలయ్య

అనంతసాగరం, సెప్టెంబరు 28: జీవం కోల్పోయిన శరీరాలు.. వణుకుతూ కుదురుగా కూర్చోలేని దీనస్థితి. సహకరించని ఆరోగ్యం... ఇలాంటి స్థితిలో ఉన్న వృద్ధ దంపతులను దత్తత పుత్రికే రోడ్డుపాలు చేసింది. నెల్లూరు జిల్లా అనంత సాగరం మండలం సోమశిలలోని పర్ణశాలల వద్ద ఆ అభాగ్యులను కూతురు, అల్లుడు వదిలేసి వెళ్లిన ఘటన శనివారం వెలుగు చూసింది. తిరుపతి జిల్లా గూడూరు మండలంలోని విందూరు ఎస్టీ కాలనీకి చెందిన బండి రమణయ్య(65), లక్ష్మమ్మ(60) దంపతులకు సంతానం లేరు. ఓ బాలికను దత్తత తీసుకొని అల్లారు ముద్దుగా పెంచి వివాహం కూడా చేశారు. రమణయ్య కుష్టు వ్యాధిబారిన పడటం వారిపాలిట శాపంగా మారింది. ఏ మాత్రం కనికరం చూపకుండా వృద్ధ దంపతులను ఓ ఆటోలో శనివారం సాయంత్రం సోమశిలకు తీసుకొచ్చి గుట్టుగా వదిలేసి వెళ్లిపోయారు. కాసేపటికి అక్కడకు వచ్చిన కానిస్టేబుల్ పెంచలయ్య మూలుగుతున్న వృద్ధులను చూసి పలకరించారు. వారి వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చిరునామా గుర్తించారు. రమణయ్య దూరపు బంధువైన ఈశ్వరయ్యకు వృద్ధ దంపతులను అప్పగించారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వర స్వామికి శనివారం తైలాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. జ్ఞానప్రసూనాంబిక సమేత ముక్కంటీశుడి అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించి విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాల అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న అభయ వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాస్ సిబ్బంది అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం తొండమానుపురంలో రాస్ వృద్ధాశ్రమంలో పరిసరాలను ఆశ్రమ సిబ్బంది, వృద్ధులు శుభ్రం చేశారు. ఊరందూరు గ్రామస్థులు, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపూడిలో వైద్య శిబిరం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28: విషజ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అన్నారు. ముళ్లపూడిలో శనివారం వైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి తమ ఆస్పతి తరపున ఉచిత వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. సీపీఐ నాయకులు జె.గురవయ్య, ఎం.శివకుమార్, ఏఐటీయూసీ నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28: పట్టణంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం గుర్రం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత మాట్లాడుతూ... గుర్రం జాషువా రచనలు భవిష్యత్తు తరాలకు ఎంతో ఆదర్శమన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిత్తూరు పీవీకేఎన్ కళాశాల అధ్యాపకుడు చిన్నకేశవులును సన్మానించారు. మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో కూడా గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవిగా సామాజిక అంశాలతో తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన నవయుగ కవి గుర్రం జాషువా అని శతావధాని ఆముదాల మురళి అన్నారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సమాజంలోని వాస్తవ సంఘటనలే ఇతి వృత్తాలుగా అంటరానితనాన్ని ప్రశ్నించేవిగా జాషువా రచనలు చేశారని తెలపారు. హెచ్ఎంలు రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



ఆర్టీసీ బస్టాండు వద్ద నాయకుల నివాళి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద శనివారం భగత్ సింగ్ జయంతి వేడుకలను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి చందు మాట్లాడుతూ... భగత్‌సింగ్ తన 12 యేట జలియన్ వాలాబాగ్‌లో బ్రిటిష్‌వారి దురాగతాలకు చలించిపోయారన్నారు. దీంతో స్వాతంత్ర్య పోరాటం కోసం విప్లవ ఉద్యమం చేసి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని కొనియాడారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌తో సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.పుల్లయ్య, గంధం మణి, పి.గురవయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 28: పాఠశాలలో చదువుతో పాటు సంస్కారం, విలువలు ఉపాధ్యాయులు నేర్పుతారని వారి అడుగుజాడల్లో నడుస్తూ విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని శతావధాని ఆముదాల మురళి, అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని శనివారం పంపిణీ చేశారు.హెచ్ఎం రూపేష్ కుమార్, ప్రకాష్‌రెడ్డి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో వైసీపీ నాయకుల పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 28: గత వైసీపీ ప్రభుత్వం హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదాలు కల్తీ జరిగాయంటూ సీఎం చంద్రబాబు తమ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సత్యవేడు నియోజకవర్గ నాయకుడు వి.రాకేష్ అన్నారు. బీఎన్‌కండ్రిగ వేంకటేశ్వర ఆలయంలో సీఎం చంద్రబాబు చేస్తున్న అపచారాలు నుంచి ప్రక్షాళన చేయాలని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మణినాయుడు, గురువయ్య, అజయ్‌కుమార్‌రెడ్డి, కిరణ్‌యాప్, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలం సేవలు కొనసాగించాలి

పిచ్చాటూరు, సెప్టెంబరు 28: సత్యవేడు నియోజకవర్గంలో 23 రోజులుగా అభివృద్ధి పనులు ఆగిపోయాయని, వాటిని కొనసాగించేందుకు ఎమ్మెల్యే ఆదిమూలంపై టీడీపీ అధిష్ఠానం విధించిన సస్పెన్షన్ ఎత్తి వేయాలని దళిత నేతలు డిమాండ్ చేశారు. శనివారం పిచ్చాటూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటించకపోవడంతో వైసీపీ శ్రేణుల దుష్టపన్నాగాలు పెరిగి పోతున్నాయన్నారు. తన సొంత నియోజకవర్గంలో కాలు పెట్టలేని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సత్యవేడుపై దృష్టి పెట్టడం ఉట్టికి ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కినట్లు ఉందన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఎం.ఎస్.రవి, సర్పంచ్ డిల్లీ, నాగరాజు, రజని, సుగందర్ పాల్గొన్నారు.

ది అమరరాజా బెటర్‌వే అవార్డుకు దరఖాస్తులాహ్వానం

రేణిగుంట, సెప్టెంబరు 28: ది అమరరాజా బెటర్‌వే అవార్డుల రెండో ఎడిషన్‌కు ఆ సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, సంస్థలకు ప్రత్యేక మద్దతును ఇచ్చేలా ది అమరరాజా బెటర్‌వే పని చేస్తోంది. ఇందులో మహిళల ఉపాధి, గ్రామీణ ఆదాయ ఉత్పత్తి, ఉత్తమ వ్యవసాయ ఆధారిత వ్యాపారంలో మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్న వారికి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను అందజేయనున్నారు. అక్టోబరు 30 లోపు amararaja.com/better-way-awards లో దరఖాస్తు చేసుకోవాలని అమరరాజా గ్రూప్ తెలిపింది.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా వెంకటేష్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28: మండల సీఐటీయూ కన్వీనర్‌గా కె.వెంకటేష్ నియమితులయ్యారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం యూనియన్ మండల కమిటీ సమావేశం జరిగింది. కో-కన్వీనర్‌గా మనోహర్, సభ్యులుగా అన్వర్‌బాషా, మునిచంద్ర, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ పోరాడుతుందని వెంకటేష్ చెప్పారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, పి.గురవయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన గజల్ శ్రీనివాస్

రేణిగుంట, సెప్టెంబరు 28: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న హజరత్‌ఖ్వాజా సయ్యద్‌షా జుంలేషా పీర్ ఖాదరివల్లీ దర్గాలో అల్లా ఉరుసు వార్షిక గంధోత్సవాల్లో గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయనకు నిర్వాహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్గాలో ఆయన ప్రార్థనలు చేసుకున్నారు. అనంతరం దర్గా ఆవరణంలో ఏర్పాటు చేసిన వేదికపై గజల్ పాటలతో భక్తుల మనసులను ఆహ్లాదపరిచారు.

పక్కా గృహాలు త్వరితగతిన పూర్తి చేయండి



చెదులపాకం లేఅవుట్‌లో లబ్ధిదారులతో సమావేశమైన అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 28: గత ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, పశు సంవర్ధక శాఖ ఏడీ మునిరాజా తెలిపారు. కుక్కంబాకం, బీఎన్‌కండ్రిగల్లోని ప్రభుత్వ లేఅవుట్లలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ... 180 పక్కా గృహాలు వివిధ దశల్లో నిలిచి పోయినట్లు గుర్తించామన్నారు. ఈ గృహాలను 2025 జనవరి నాటికి పూర్తి చేయకపోతే రాయితీ సహా ప్రభుత్వం నుంచి నిధులు రావని చెప్పారు. హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుహ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వరయ్యపాళెం: మండలంలోని చెదులపాకం లేఅవుట్‌లో శనివారం మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి చిన్నయ్య, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: ప్రభుత్వ లే అవుట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. కొత్తమారి కుప్పం హౌసింగ్ లే అవుట్ వద్ద సెక్రటరీ మునిరవికుమార్ ఆధ్వర్యంలో మన ఇల్లు - మన గౌరవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మార్చి నెలాఖరు లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువు పూర్తయిన తరువాత ప్రస్తుత పథకం అమలయ్యే అవకాశాలు ఉండవన్నారు. సెక్రటరీ హరీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కీర్తన, హర్ష, త్యాగరాజు, మహేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంపై 28, 29 వార్డుల పరిధిలోని సచివాలయంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ గిరిబాబు ఇంటి నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, టీడీపీ నాయకులు అత్తిరాల భాస్కర్‌గౌడ్, గంగిరెడ్డి, ఆనంద్, రవిశంకర్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, మురళి, మణికంఠ, ప్రజలు పాల్గొన్నారు.

తరతరాల వారసత్వ సంపద జానపదం

విశ్రాంత అధ్యాపకుడు చిగిచెర్ల కృష్ణారెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కృష్ణారెడ్డి

శ్రీసిటీ, సెప్టెంబరు 28: 'జానపద కళలు, జానపద సంస్కృతి భారతీయుల తరతరాల వారసత్వ సంపద. మనం వాటిని సంరక్షించి బావి తరాలకు అందించాలని' హైదరాబాద్ శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి అన్నారు. శ్రీసిటీలోని ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జానపద కళలు, సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి తనదైన శైలిలో వివిధ కథలు, పాటలు, మాండలికాలతో ప్రసంగం సాగించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ జానపదాలకు పుట్టిల్లు పల్లెటూళ్లు అన్నారు. జానపదాలు పల్లె ప్రజల దైనందిక పనుల్లో భాగస్వామిగా మారి జనపదాలుగా రూపుదిద్దుకున్నాయన్నారు. రాయలసీమ ప్రాంతంలో జానపద కళల ప్రాముఖ్యతను వివరిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వీధి నాటకాలు, కడపలో భజనలు, కర్నూలులో గువయ్య నృత్యం, అనంతపురంలో ఉరుముల నృత్యం ప్రధానమైనదిగా పేర్కొంటూ, వివిధ పద్యాలు, పాటల రూపంలో వాటిని వివరించారు. చిగిచెర్ల జానపద ఉపన్యాసాన్ని ప్రశంసించిన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ... అంతరించి పోతున్న జానపద సంపదను సంరక్షించేందుకు తమవంతు చేయూత నందిస్తామని చెప్పారు. అనంతరం పెరటాశి నెల రెండో శనివారాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ మహోత్సవాన్ని నిర్వహించారు.

సుప్రీంకోర్టు సీజేకి ఘనస్వాగతం



జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు న్యాయమూర్తుల స్వాగతం

రేణిగుంట, సెప్టెంబరు 28: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు శనివారం సాయంత్రం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, రిజిస్ట్రార్ జనరల్ జస్టిస్ రాఘవస్వామి,జస్టిస్ రామకృష్ణ, చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి వై.లక్ష్మణరావు, చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు, ప్రోటోకాల్ ఆఫీసర్ గురునాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం భన్సల్ తదితరులు న్యాయమూర్తికి స్వాగతం పలికారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

రేణిగుంట, సెప్టెంబరు 28: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం పట్టణంలోని శ్రీకాళహస్తిరోడ్డులో జరిగింది. స్థానికుల కథనం మేరకు శ్రీకాళహస్తి రోడ్డులో నివాసం ఉంటున్న షేక్ రసూల్(75) రోడ్డు దాటుతుండగా యువకుడు వేగంగా బైకుపై వస్తూ అదుపుతప్పి వృద్ధుడిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో వృద్ధుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు ఆయన్ను అమరరాజా ఆస్పత్రికి తరలించారు.దీనిపై కుటుంబీకులు రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సిమెంట్ పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు



వరదయ్యపాళెం, సెప్టెంబరు 28: మండలంలోని వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు సత్యవేడు మండలం మదనంజేరిలో ఉన్న బీఎల్ఎం విష్ణుచక్ర సిమెంట్ పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమ మేనేజరు నవనీత కన్నన్ విద్యార్థులకు సిమెంటు తయారీ విధానాన్ని వివరించారు. టీఐఎస్ రీజనల్ మేనేజరు మెంటర్ మేఘనాథ్ మాట్లాడుతూ ఇలాంటి పర్యటనలు విద్యార్థులకు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య, పీడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం బహిష్కరణ



నిరసన తెలుపుతున్న వార్డు సభ్యులు

రేణిగుంట, సెప్టెంబరు 28: రేణిగుంట పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని వార్డు సభ్యులు బహిష్కరించి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల మేరకు అజెండాలోని అంశాలను కార్యదర్శి చదివి వినిపించలేదన్నారు. గత సమావేశంలో ఆమోదించిన పనులకు ఎంబుక్, ఓచర్లను చూపాలని కోరగా ఇందుకు కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, సర్పంచ్ నాగేశం ఇష్టారాజ్యంగా మాట్లాడారన్నారు. దీంతో సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు.

ప్రజల వద్దకే పాలన సీఎం లక్ష్యం



పోస్టర్ల ఆవిష్కరణలో గురవారెడ్డి తదితరులు

ఏర్పేడు, సెప్టెంబరు 28: పరిపాలనను ప్రజల వద్దకే తీసుకు రావాలనే లక్ష్యం దిశగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి అన్నారు. మన్నసముద్రంలో శనివారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ... ప్రజాసమస్యలు తెలుసుకోవడానికి అధికారులే గ్రామాలకు వస్తున్నారన్నారు. అనంతరం స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. శంకర్‌నాయుడు, మునెయ్య, వెంకటేష్, తులసీరామ్, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, వీఆర్వో మణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలపై చర్చలో ఝూన్సీ ప్రతిభ



వరదయ్యపాళెం, సెప్టెంబరు 28: స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047లో భాగంగా రాబోయే 5 సంవత్సరాల్లో చేపట్టనున్న విద్యా సంస్కరణలపై జిల్లాస్థాయి చర్చా వేదికలో సంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.ఝూన్సీ మొదటి స్థానంలో నిలిచింది. తిరుచానూరులో జరిగిన కార్యక్రమంలో డీఈవో శేఖర్ ఝూన్సీకి ప్రశంసాపత్రం, బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమలో గైడ్ టీచర్ అమృత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో బాపూజీ విద్యాసంస్థల సత్తా



ఏర్పేడు, సెప్టెంబరు 28: నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్ శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి. అండర్-14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాపానాయుడుపేట బాపూజీ విద్యాసంస్థల విద్యార్థులువిజేతలుగా నిలిచారు. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో మోహన్, యుగంధర్, ధనుష్, చంద్రసిద్ధార్థ్, బాలికల విభాగంలో ప్రత్యూష, మునిలక్ష్మి, వర్షిత, సియోన, అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో వినయ్, జగన్ జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 సీనియర్ బాలికలు మిత్రవింద, అనిలా, చేతన, జెరూన,, అండర్ సీనియర్ బాలుర కబడ్డీ విభాగంలో జుహీట్ కుమార్, తరుణ్, అండర్-14 బాలికల వాలీబాల్ విభాగంలో వర్షిత, క్రిస్టినా, మునలక్ష్మి, సియోన ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బాలాజీనాయుడు, డైరెక్టర్ అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు మధు, ఉపాధ్యాయులు అభినందించారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి: ఆనంద్



సభ్యత్వ నమోదులో కోలా ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి,సెప్టెంబరు 28: సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని బీపీ అగ్రహారం వద్ద యువమోర్చా పట్టణప్రధాన కార్యదర్శి హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సభ్యత్వ నమోదును ఆయన పరిశీలించారు. సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి 5వ స్థానంలో ఉందని మొదటిస్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ, హరీష్, హరి, రవి, సాగర్, దినేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28: తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో పెంచలకిషోర్‌ను టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగురైతు ఉపాధ్యక్షుడు టి.ప్రకాష్‌నాయుడు, నాయకులు జి.సురేష్‌నాయుడు, జి.సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

కేవీబీపురం, సెప్టెంబరు 28: మండలంలోని తిమ్మసముద్రంలో కార్యదర్శి అమ్ములు ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనలో జరిగిన అభివృద్ధి వివరించారు. తమ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు సర్పంచ్ దొరబాబు నాయుడికి వినతిపత్రాలు అందించారు. దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.